పట్టపగలే రూ.10 లక్షలు చోరీ

వివరాలు సేకరిస్తున్న సీఐ అనిల్‌కుమార్

అందోల్, ఆగస్టు 12: కారు నిలిపి పది నిమిషాలు పక్కకు వెళ్లి వచ్చే సరికే రూ.పది లక్షలతో ఉడాయించారు గుర్తు తెలియని వ్యక్తులు...అది కూడా జోగిపేట పీఎస్ గేట్ ఎదుట ఎప్పుడూ జనం రద్దీగా ఉండే ప్రాంతంలో ఘటన చోటుచేసుకోవడం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన రిటైర్డ్ ట్రాన్స్‌కో అధికారి రవీందర్ రెడ్డి సోమవారం జోగిపేట ఎస్‌బీఐలో తన కుమారుడు సాయికిరణ్ అకౌంట్ నుంచి చెక్ ద్వారా రూ.10 లక్షలు డ్రా చేశాడు. డ్రా చేసిన డబ్బును డ్రైవింగ్ సీటు పక్కన పెట్టుకుని కారులో ఇంటికి వెళ్తూ... జోగిపేట పోలీస్‌స్టేషన్ ముందున్న బాలాజీ స్వీట్‌హౌస్‌కు వెళ్లేందుకు కారును స్టేషన్ గేట్ ముందు ఆపి లాక్ చేసి స్వీట్లు కొనేందుకు వెళ్లాడు. స్వీట్లు కొని తిరిగి కారు వద్దకు వచ్చి చూసే సరికి అద్దాలు పగులగొట్టి ఉండడం...కారులో ఉన్న డబ్బులు లేకపోవడంతో ఎవరో డబ్బులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సీఐ అనిల్‌కుమార్, ఎస్సై పాండు ఆధ్వర్యంలో బ్యాంక్‌తో పాటు కారు పార్కింగ్ చేసిన చోట..స్వీట్ హౌజ్, ఇతర చోట్ల సీసీ పుటేజీలు పరిశీలించినా ఆచూకీ మాత్రం లభించలేదు. బాధితుడు రవీందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇండ్ల మధ్య కల్లు దుకాణం వద్దు

కంది, ఆగస్టు 12: సరస్వతీ శిశుమందిర్, ఇండ్ల మధ్య కల్లు దుకాణం పెట్టోద్దంటూ సోమవారం కంది తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సరస్వతీ శిశుమందిర్ ప్రధాన ఆచార్యుడు పండరయ్య సమక్షంలో కొత్త కంది కాలనీవాసులు ధర్నా చేసి తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. అధికారులు వెంటనే కల్లు దుకాణాన్ని మూసి వేయించాలని, లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జానీపాషా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్



ప్రజావాణిలో అర్జీ సమర్పించేందుకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు

- మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ వినతి
- ప్రజావాణికి మొత్తం 86 అర్జీలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 12: స్విన్ ఫార్మా పరిశ్రమ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీ సమర్పించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజావాణికి మొత్తం 86 అర్జీలు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 56 ఉండగా మిగతావి వివిధ శాఖలకు సంబంధించి ఉన్నాయి. ఆయా అర్జీలను అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురీలతో కలిసి కలెక్టర్ వల్లూరు క్రాంతి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన అనంతరం రాములునాయక్ మాట్లాడుతూ పాశమైలారంలోని స్విన్ ఫార్మా పరిశ్రమలో 20 ఏండ్లుగా పని చేస్తున్న కార్మికులపై యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతున్నదని ఆరోపించారు. కార్మికులను పర్మినెంట్ చేసి న్యాయం చేయాలన్నారు. రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామస్తులు అర్జీ అందజేశారు. రోడ్లపై చెత్త వేయొద్దని చెప్పినందుకు దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి మున్సిపల్ కార్మికులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఏవో పరమేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

త్రీఫేస్ కరెంటు సరఫరా చేయాలి

సంగారెడ్డి, ఆగస్టు 12: ఇరవై ఏండ్లుగా త్రీఫేస్ కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్నామని 18వ వార్డు మధురానగర్ కాలనీవాసులు కోరారు. మొత్తం 150 కనెక్షన్లు ఉన్నాయని త్రీఫేస్ కరెంట్ లేక బోరు మోటార్లు, టీవీలు, ఫ్యాన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయని వార్డు కౌన్సిలర్ అశ్విన్, కాలనీ అధ్యక్షుడు మురళి తెలిపారు.

రింగ్ రోడ్డు అలైన్మెంట్ మార్చాలి

సంగారెడ్డి, ఆగస్టు 12: గిర్మాపూర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్‌ను మార్చాలని, గతంలో ఉన్న అలైన్మెంట్‌తోనే భూసేకరణ చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సీపీఎం నాయకులు భూబాధితులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు జయరాజు, టీజేఎస్ నాయకులు తుల్జారెడ్డిలు మాట్లాడుతూ ట్రిపుల్‌ఆర్ కోసం బలవంత భూసేకరణను ఆపాలని కోరారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

న్యాల్‌కల్, ఆగస్టు 12: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో మండలంలోని హద్నూర్ గ్రామానికి చెందిన కమనోల నర్సింహారెడ్డికి మంజూరైన రూ.60 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ శివకుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, హద్నూర్ పీఎసీఎస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, సుభాశ్‌గుప్తా, నర్సింహారెడ్డి, షబ్బీర్‌ఖాన్, సంగారెడ్డి, స్వామిదాస్, మహేశ్, గుండప్ప పాల్గొన్నారు.

తనిఖీలు చేపట్టాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 12: ఔషధ నియంత్రణ తనిఖీలను విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం జిల్లా డ్రగ్స్ అధికారులు, జిల్లా పరిశ్రమల శాఖ, రెగ్యులేటరీ అథారిటీ, సీఎస్ఆర్ నిధుల సేకరణపై జిల్లా, క్లస్టర్ అధికారులతో సమావేశమయ్యారు. ఔషధ నియంత్రణ ఇన్‌స్పెక్టర్లు జనవరి నుంచి జూలై వరకు నిర్వహించిన తనిఖీల వివరాలను వెల్లడించారు. పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులు వసూలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ మాధురి ఉన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిని శిక్షించాలి

గుమ్మడిదల, ఆగస్టు 12: తమ కూతురు ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని తేజస్విని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామానికి చెందిన బీఫార్మసీ విద్యార్థి తేజస్విని అదే గ్రామానికి చెందిన శ్రీహరి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. అతడి వేధింపులతోనే తమ కూతురు ఆత్మహత్య చేసుకున్నదని కుటుంబ సభ్యులు, విద్యార్థులు సోమవారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం శ్రీహరిని, అతడి తల్లిని చట్టరీత్యా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఎంతటి నిరసనకైనా సిద్ధమని బీఫార్మసీ విద్యార్థులు హెచ్చరించారు. మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు యాదగిరి ఈ ర్యాలీలో పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు వైద్య శిబిరం

సంగారెడ్డి, ఆగస్టు 12: విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం పట్టణంలోని తాహసీల్ కార్యాలయ ఆవరణలోని విశ్రాంతి ఉద్యోగుల కార్యాలయంలో సహారా ఇంక్లుసివ్ దవాఖాన ఆధ్వర్యంలో సీనియర్ సిటిజెన్స్‌లకు న్యూరాలజీ వైద్య శిబిరం నిర్వహించారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ ధీమంత్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువతరంతోనే నవ సమాజ నిర్మాణం

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 12: యువతరంతోనే నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, అధ్యాపకులు డాక్టర్స్ జ్యోత్స్న, మల్లిక, అనురాధ, సదయ్య కుమార్, సుమతి, పద్మ పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ శ్రీమతి వనమాల గంగాజల, భర్త: అశోక్ వయస్సు: 45 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, ప్రస్తుత నివాసం: హైదరాబాద్, గారి భూమి సంగారెడ్డి జిల్లా, హత్నూర (మం), శేర్ ఖాన్ పల్లి గ్రామం మరియు పంచాయతీలోని సర్వే నం. 138/అ/1లో ఎ1-29 గుంటలు, తూర్పు: శేర్‌ఖాన్ పల్లి-అక్కంచగూడ రోడ్, పడమర: విజయ్ కుమార్ వ్యవసాయ భూమి, ఉత్తరం: పెద్దరామగోని అనసూయ వ్యవసాయ భూమి, దక్షిణం: విజయ్ కుమార్ వ్యవసాయ భూమి మరియు 84/అ, 84/ఇ/1, 90/అ, 90/ఆ, 90/ఇ/1, 91/అ, 91/ఆ, 91/ఇ, 91/ఊ, 92/ఆఇ సర్వే నం.లలోని మొత్తం ఎ. 6-32 గుంటలు, తూర్పు: పెద్దరామగోని మల్లగౌడ్ వ్యవసాయ భూమి, పడమర: నడిమింటి నారగౌడ్ వ్యవసాయ భూమి, ఉత్తరం: తలారి పెంటయ్య వ్యవసాయ భూమి, దక్షిణం: చిట్టి దశరథ వ్యవసాయ భూమి హద్దులు కలిగిన ఇట్టి భూములపై నర్సాపూర్ కోర్టులో కేసు OS 103/2020 వేసి ఉన్నాను. ఈ కేసు నర్సాపూర్ నుండి సంగారెడ్డి PJCJ కోర్టుకి OS 996/2022గా బదిలీ అయ్యి, పెండింగ్‌లో ఉంది. కాబట్టి ఇట్టి భూమి పై లావాదేవీలు జరుపుటకు తన భర్త అశోక్‌కి ఎలాంటి హక్కులు లేవు. కావున యావన్మందికి తెలియచేయునది ఏమనగా సదరు షెడ్యూల్ ఆస్తి పై ఎవరైనా ఇతనిని నమ్మి ఈ భూమి పై వ్యవహారం నడిపినచో నా క్లయింట్ తీసుకొనబోవు చట్టపరమైన తగు చర్యలకు బాధ్యులు అవుతారు. తదుపరి వివరములకు ఈ క్రింది ఫోన్ నం.లో సంప్రదించగలరు.

సం/- (Ra) శ్రీ వి.కె. గోపినాథ్‌రావు, అడ్వకేట్
ఫోన్: 7095464547

ఎంగేజ్‌మెంట్ ఖరారు.. ప్రేమికుడు పరార్

సురేశ్

బొల్లారం, ఆగస్టు 12: ఓ ప్రేమ జంటకు పెద్దల అంగీకారంతో రెండు రోజుల్లో ఎంగేజ్మెంట్ కానుండగా ఇంతలోనే ప్రేమికుడు ముఖం చాటేశాడు. ఈ ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అమ్మాయి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం గాంధీనగర్‌కు చెందిన నరసింహ కూతురు (27), లక్ష్మీనగర్ కాలనీలో ఉంటున్న శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన సురేశ్(27)తో ఈనెల 14వ తేదీన నిశ్చితార్థం కుదిర్చారు. ఇంతలోనే ఉన్నట్టుండి సురేశ్ పరారయ్యాడు. తన కోసం వెతకవద్దని, పెండ్లి ఇష్టం లేదని ప్రేమించిన యువతికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో యువతి సోదరుడు రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకట్రావ్ మక్త తండాకు రోడ్డు వేయాలి

కంది, ఆగస్టు 12: కంది పంచాయతీ పరిధిలోని వెంకట్రావ్ మక్త తండాకు రోడ్డు వేయాలని స్థానికులు కోరారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి తండాకు వెళ్తే రహదారి కోతకు గురవ్వడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఉదయం పిల్లలు స్కూల్‌కు వెళ్లేదారి లేక తల్లిదండ్రులు ఎత్తుకొని వారిని నీటి నుంచి దాటించాల్సిని పరిస్థితి ఏర్పడింది. వర్షాలు కురిసిన ప్రతిసారి ఇదే పరిస్థితి ఉందని, తండాకు రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

కాళ్లరిగేలా తిరిగినా కనికరించడం లేదు

హత్నూర, ఆగస్టు 12: తన అత్తగారి పేరుమీద ఉన్న భూమి ఆమె మరణించడంతో పౌతీ మార్పుచేస్తూ తన భార్య పేరుపై మార్చాలని రెండున్నరేళ్లుగా తహసీల్ కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు కనికరించడంలేదని తుర్కలఖానాపూర్ గ్రామానికి చెందిన నీరుడి హన్మంతు తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన అత్త నీరుడి ఎల్లమ్మ మూడేండ్ల క్రితం మరణించిందని, సాదుల్లానగర్‌లో తన పేరుమీదున్న 16 గుంటల భూమిని తన భార్య మొగులమ్మ పేరుపై పౌతి మార్చాలని కోరాడు.

నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలి

వట్‌పల్లి, ఆగస్టు 12: మార్కెట్ కమిటీ నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు అవకాశం ఇవ్వాలని అందోల్ డివిజన్ అధ్యక్షుడు సుభాష్ నాయక్ కోరారు. మండల పరిధిలోని వట్‌పల్లి మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ పండరీకి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీలోని నామినేటడ్ పోస్టుల్లో దివ్యాంగులకు స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వైస్ ప్రసిడెంట్ ఖలీల్, కార్యదర్శి నర్సింలు, అఖిల్ పాల్గొన్నారు.

ధ్యాన మందిర నిర్మాణానికి విరాళం

బొల్లారం, ఆగస్టు 12: మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ధ్యాన మందిరానికి పటాన్‌చెరు మండలం ఘనాపూర్ గ్రామానికి చెందిన విశ్వకర్మ సంఘం నాయకుడు కమ్మరి లక్ష్మీనారాయణ దంపతులు రూ.90 వేల విరాళం సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భరత్ చారి, విట్టల్ చారి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పట్టించుకోరా?

ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోహీర్, ఆగస్టు12: జహీరాబాద్ పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి రాంచందర్, కమిటీ సభ్యుడు మహిపాల్ మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రూ.250 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పింఛన్లు, రేషన్ కార్డులు, మురుగునీటి తరలింపు కోసం కాల్వల నిర్మాణం, సీసీ రోడ్లు నిర్మించాలన్నారు. పదేండ్లుగా మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఆరోపించారు. కార్మికులకు ఇంటి స్థలాలతోపాటు నిర్మాణానికి రూ.5లక్షలను మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవో రాజుకు వినతిపత్రం ఇచ్చారు.

విద్యార్థులకు ఫైలేరియా మాత్రలు పంపిణీ

విద్యార్థులకు ఫైలేరియా మాత్రలు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ రోజాబాల్‌రెడ్డి

బొల్లారం, ఆగస్టు 12: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జాతీయ ఫైలేరియా, నులి పురుగుల నివారణ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోలన్ రోజాబాల్‌రెడ్డి, కమిషనర్ మంగతాయారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అందించే మాత్రలను ప్రతి విద్యార్థి వేసుకోవాలని సూచించారు. అనంతరం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన ఉపన్యాస పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శైలజ, ఆర్వో నర్సింలు, వైద్యాధికారులు నిర్మలారెడ్డి, భవాని, హెచ్ఎం మంగీలాల్ వైద్య సిబ్బంది పరమేశ్, ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తంగి కార్యదర్శిపై ఫిర్యాదు

కార్యదర్శిపై ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తుడు

పటాన్‌చెరు, ఆగస్టు 12: ముత్తంగి కార్యదర్శిపై పటాన్‌చెరు తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గ్రామానికి చెందిన గడీల సురేశ్‌గౌడ్ కుమారుడు కిరణ్‌గౌడ్ ఫిర్యాదు చేశాడు. గ్రామంలో గడీల సురేశ్‌గౌడ్‌కు చెందిన పట్టా భూమి సర్వే నంబర్ 502లో ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేపట్టగా, దానికి పంచాయతీ అక్రమంగా ఇంటి నంబర్ సైతం కేటాయించిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ తతంగంపై ఫిర్యాదు చేస్తే డీపీవో సర్వే చేయించి ఆ ఇంటి నంబర్ కేటాయింపు అక్రమమని అర్డర్ ఇచ్చి తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీకి ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. డీపీవో ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఇంటి నంబర్లను గత నెలలో రద్దు చేశారని, తహసీల్దార్ పంపిన బృందం కూల్చివేతలకు వస్తే గ్రామ కార్యదర్శి నవోద్ ఇతర కారణాలు చూపుతూ అక్రమ నిర్మాణాల కూల్చివేతలను అడ్డుకున్నాడని ఆరోపించాడు. అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

అమీన్‌పూర్ ఆగస్టు 12: అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని నరేంద్ర కాలనీలో రహదారులను, పీఎన్ఆర్ కాలనీ, సాయి అంబికా కాలనీల్లో చేపడుతున్న మంచినీటి పైపు లైన్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్‌బీ జీఎం చంద్రశేఖర్, కౌన్సిలర్ కృష్ణ, ఏఈ ప్రవీణ్, కోఆప్షన్ సభ్యుడు తలారి రాములు, కొల్లూరు యాదగిరి పాల్గొన్నారు.

దాడులకు వ్యతిరేకంగా బంద్

జహీరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పలు సంఘాల నాయకులు, విద్యార్థులు

కోహీర్, ఆగస్టు12: హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, దళితులపై బంగ్లాదేశ్‌లో జరిగిన మారణహోమానికి నిరసనగా సోమవారం జహీరాబాద్ పట్టణంలో బంద్ పాటించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలతోపాటు వ్యాపారులు బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పట్టణంలోని శివాజీ విగ్రహం నుంచి 65వ జాతీయ రహదారి గుండా బృందావన్ రెస్టారెంట్ వరకు ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లోని మైనార్టీలపై దాడులు చేయడం, అనేక మందిని చంపడం దారుణమన్నారు. కార్యక్రమంలో పలు హిందూ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై వీధి కుక్క దాడి

కోహీర్, ఆగస్టు 12: కోహీర్ పట్టణంలోని తోప్సివాడ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదో తరగతి విద్యార్థిని నూరి సదాఫ్‌ను వీధి కుక్క కరిచింది. మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాల నుంచి ఇంటికి బయలుదేరింది. మార్గ మధ్యలో వీధి కుక్కలు బాలికను చూసి వెంబడించాయి. వాటి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఒక కుక్క దాడి చేసి ఐదు చోట్ల కరిచింది. గాయాలైన సదాఫ్‌ను దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కోహీర్ పట్టణంలో వీధి కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విరాళం

జిన్నారం, ఆగస్టు 12: మండలంలోని మాదారం గ్రామంలో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ విరాళం ఇచ్చారు. పాఠశాల విద్యార్థులకు క్రీడలు నిర్వహించేందుకు, స్వాతంత్ర వేడుకలు ఘనంగా జరిపేందుకు రూ.35 వేలు ఉపాధ్యాయులకు సోమవారం అందజేశారు.

చదువుతోనే భవిష్యత్

సంగారెడ్డి, ఆగస్టు 12: చదువుతోనే భవిష్యత్ బంగారుమయం అవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని మాస్టర్ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోక్సో, వరకట్నం, గృహహింస, మానవ అక్రమ రవాణా, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నక్క బాటపై సర్వే

జిన్నారం, ఆగస్టు 12: ఊట్ల గ్రామ పరిధిలో నక్క బాటను ఆక్రమణ నుంచి కాపాడాలని గ్రామస్తులు రెవెన్యూ అధికారులను కోరిన నేపథ్యంలో సర్వేయర్ రామభద్ర సోమవారం నక్క బాటను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. మూడు సర్వే నంబర్లలో నక్క బాటను సర్వే చేసి గుర్తించారు. నక్క బాటను పూర్తిగా గుర్తించాలని పలువురు గ్రామస్తులు కోరారు. కేవలం ఒకటి, రెండు సర్వేనంబర్లలో నుంచే కాకుండా రికార్డుల ప్రకారం నక్క బాటను సర్వే చేయాలన్నారు.

విద్యార్థుల శ్రమదానం

రామచంద్రాపురం, ఆగస్టు 12: బీహెచ్ఈఎల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ప్రిన్సిపాల్ రవీందర్ నేతృత్వంలో విద్యార్థులు శ్రమదానం చేశారు. కళాశాల పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలిగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శ్రమదానంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవ దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు.

వైభవంగా శివ పంచాక్షరీ

కంగ్టి, అగస్టు 12: శ్రావణమాసం రెండో సోమవారం కంగ్టి సిద్దేశ్వరాలయం శివ పంచాక్షరీ జపంతో మార్మోగింది. సోమవారం సిద్దేశ్వరాలయ ఆవరణలో సంగారెడ్డికి చెందిన జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడే మహేశ్వర సిద్ధాంతి శర్మ ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరిలివచ్చి పంచాక్షరీ జపాన్ని ఆలపించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దారం సంజయ్‌గుప్తా, చంద్రమోహన్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 12: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా ఏర్పాట్లు యుమలరి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ జిల్లా పరేడ్ మైదానంలో నిర్వహించే వేడుకలపై ఆదేశాలిచ్చారు. పోలీసుల గౌరవ వందన స్వీకరణ, బందోబస్తు ఏర్పాటు, తాగు నీరు, సీటింగ్, వేదిక, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ముఖ్య అతిథి ప్రసంగం రూపొందించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. ఎన్‌సీసీ కెడెట్ల మార్చ్‌ఫాస్ట్, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నిర